రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వేసవి నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక కొత్త కాలనీలు ఏర్పాటవుతున్నాయి. పలు భవన నిర్మాణాలు జరుగుతుండడంతో ఈ ప్రాంతానికి ఇతర రాష్ట్రాల నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున వలస వచ్చారు. వారిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చలివేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించారు. అందులో భాగంగా రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 17వార్డులు ఉండగా మొదట 6 ప్రాంతాలలో అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో సేవ సంఘాలు, రాజకీయ నేతలు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో విద్యుత్‌నగర్ ట్యాంక్ వద్ద, కొల్లూర్, ఈదుల నాగులపల్లి, వెలిమెల, ఇందిరానగర్ సర్కిల్ వద్ద నూతన మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. బాటసారులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు..
సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాంతంలో ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని రోడ్ల పక్కన మట్టికుండలను ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీరుస్తాం.

నీరు, విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలి

ఈపీటీఆర్ఐ డీజీ, పర్యావరణం, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్



గచ్చిబౌలిలోని ఎస్కీలో.. విశ్రాంత ఐఏఎస్ అధికారి జగదీశ్వర్, ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు తదితరులు

గచ్చిబౌలి: ప్రతి ఒక్కరూ నీరు, విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందని ఈపీటీఆర్ఐ డీజీ, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గచ్చిబౌలిలోని 'బిల్డింగ్ క్లెమైట్ రెసిలీయన్స్ ఫర్ వాటర్ సెక్టార్' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేడి పెరుగుతున్న తరుణంలో ఏసీల వినియోగం పెరుగుతోందని, తద్వారా వేడి కూడా మరింతగా పెరిగిపోతుందన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్, ఈపీటీఆర్ఐ ప్రొఫెసర్ ఏకే గోసేన్, ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ ఎంవిఎస్ఎస్ గిరిధర్, సత్యనారాయణ, సుధీర్‌కుమార్, డా.రాజేశ్వర్, డా. శేష శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నీటి కోసం పోరాటం చేయాల్సిన రోజులు వచ్చాయి

రాయదుర్గం: మనిషి ప్రస్తుతం నీళ్ల కోసం పోరాటం చేయాల్సిన రోజులు వచ్చాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం జగదీశ్వర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ప్రపంచ నీటి దినోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య నీటి కోసం యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. నీటి పొదుపును పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవాలు చేసుకున్నప్పటికీ ప్రజలు నీటి పొదుపు పాటించినప్పుడు మాత్రమే ఈ ఉత్సవాలకు అర్థం ఉంటుందన్నారు.

ఎస్కీ- జేబీఐఈటీ మధ్య ఒప్పందం



ఒప్పందం చేసుకున్న ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన మరింత పెంచేందుకు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా–జేబీఐఈటీ మధ్య ఒప్పందం కుదిరింది. రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం 'ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్– మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్' పై నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యు కేషన్, ఎంఎస్‌డీఈ మంత్రిత్వశాఖ స్పాన్సర్ చేసిన ఫ్లాగ్‌షిప్ చొరవతో ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు చదువుతోపాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ ప్రోగ్రామింగ్, కోడింగ్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌లో రాణించడానికి అవసరమైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జేబీఐఈటీ ప్రిన్సిపల్ డాక్టర్ పిసి కృష్ణమాచారి, డైరెక్టర్ సిహెచ్ సంజయ్ ప్రసంగిస్తూ చదువుతోపాటు విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందిస్తే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఎస్కీ, జేబీఐఈటీ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యం రూ. 284 కోట్లు..



ఇప్పటికే రూ.226 కోట్లు వసూలు

శేరిలింగంపల్లి: ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లలో జీహెచ్ఎంసీ పరిధిలో ఏటా శేరిలింగంపల్లి సర్కిల్ అగ్రగామిగా నిలుస్తోంది. మరో వారం రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు లక్ష్యం రూ.284.96 కోట్లుగా నిర్దేశించారు. కాగా ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శేరిలింగంపల్లి సర్కిల్‌లో రూ.226.40 కోట్లు వసూలు కావడం విశేషం. గత ఏడాది ట్యాక్స్ బకాయిలు ఈ నెల 31వ తేదీ వరకు చెల్లిస్తే వడ్డీలో 90 శాతం రాయితీ వస్తుందని, ఈ విషయాన్ని బకాయిదారులకు వివరించి ట్యాక్స్ చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్‌లతో పాటు భారతీనగర్ డివిజన్ పరిధిలోని భెల్ ఎంఐజీ కాలనీ సైతం ఉంటాయి. వీటి పరిధిలోనే వసూలు చేయాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లపై దృష్టిట్ సారించడంతో అధికార యంత్రాంగం లక్ష్యసాధనకు చేరువకానుంది. మిగిలిన వారం రోజుల్లో పూర్తి లక్ష్యాన్ని సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అసెస్‌మెంట్ల వివరాలు..

- ప్రాపర్టీ ట్యాక్స్ వసూలుకు శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు.
- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో నాన్ రెసిడెన్షియల్ భవనాలు 17,166 ఉండగా 13,541 అసెస్‌మెంట్ల ద్వారా రూ.117.29 కోట్లు వసూలయ్యాయి.
- రెసిడెన్షియల్ అసెస్‌మెంట్లు 99,195 సర్కిల్ పరిధిలో ఉండగా 73,671 అసెస్‌మెంట్ల ద్వారా రూ.98.18 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు అయింది.
- గత ఏడాది మార్చి 31 వరకు రూ.219.36 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు కాగా ఇప్పటికే అధిగమించి అదనంగా రూ. 7 కోట్లు పైగా వసూలు చేశారు.
- ఇప్పటికే బిల్ కలెక్టర్ వారీగా అత్యధిక బకాయిలు ఉన్న వారిని గుర్తించి నోటీసులు ఇవ్వడంతో పాటు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేసేందుకు ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
- ప్రాపర్టీట్యాక్స్‌ను ఆయా ప్రాంతాల బిల్ కలెక్టర్లతో పాటు ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాలు, సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో కూడా చెల్లించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి..



శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ప్రతి భవన యజమాని ప్రాపర్టీ ట్యాక్స్‌ను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఆస్తి పన్ను వసూళ్ళకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించవచ్చు. ఆన్‌లైన్‌తో పాటు ఆయా ప్రాంతాల బిల్ కలెక్టర్లకు కూడా ట్యాక్స్ చెల్లించి సహరించాలి. గత ఏడాది వరకు ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు ఈ నెల 31వ తేదీ వరకు చెల్లించే వారికి వడ్డీలో 90 శాతం రాయితీ లభిస్తుందన్నారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– రజనీకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్

ప్రజాపాలన దరఖాస్తుల అప్‌డేట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాపాలన దరఖాస్తులను అప్‌డేట్ చేయించుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారు రూ.500 గ్యాస్, జీరో విద్యుత్‌బిల్ కోసం దరఖాస్తులను అప్‌డేట్ చేయించుకుంటున్నారు. గత పదిరోజులుగా 250 దరఖాస్తులను అప్‌డేట్ చేయించుకున్నారని మున్సిపల్ అధికారులు తెలిపారు.

నేడు 'టిఫిన్ బై టాక్'

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ న్యూ వివేకానందనగర్ బావార్చి హోటల్ వీధి నెంబర్ 9లోని సర్కిల్‌లో శనివారం ఉదయం 8.30 గంటలకు టిఫిన్ బైటాక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ మేడ్చల్ జిల్లా సెక్రటరి పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని అన్ని విభాగాల అధ్యక్షులు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో నాగ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవతా సహిత నాగ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శాంతి పాఠం, హోమం తదితర పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్లు రామస్వామియాదవ్, లక్ష్మీనారాయణగౌడ్, రాజేశ్వరమ్మ, బీఆర్ఎస్ నాయకులు మిరియాల రాఘవరావు, శ్రీనివాస్ యాదవ్, రమణ మూర్తి, కరుణాకర్ గౌడ్, పద్మారావు, కాలనీ ప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కాశీనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

జిన్నారం-కొడకంచికి పాదయాత్ర



జిన్నారం నుంచి పాదయాత్ర ద్వారా కొడకంచికి వెళ్తున్న రామభక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): అయోధ్య రామమందిర యాదిలో అనే కార్యక్రమంలో భాగంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిన్నారం నుంచి కొడకంచి గ్రామంలోని ఆదినారాయణస్వామి దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షులు ఆనంద్‌చారి మాట్లాడుతూ అయోధ్య నిర్మాణం జరిగి రెండు నెలలు అవుతుండటంతో పాదయాత్ర చేపట్టామన్నారు. ప్రతినెల నిర్వహించే ఈ పాదయాత్రలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మపరిరక్షణ సమితి నాయకులు రవి, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మేందర్, నర్సింహారెడ్డి, పల్నాటి భాస్కర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా స్థలం ఇప్పించండి



స్థలం డాక్యుమెంట్లు చూపిస్తున్న బాధితులు

పంజగుట్ట: 'అనాథాశ్రమం, చర్చి నిర్మిద్దామని స్థలం కొనుగోలు చేశాం. స్థలానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు మా ఇంట్లోనే ఉన్నాయి. కానీ జీఓ 59 మూలంగా మా స్థలాన్ని మాకు తెలియకుండా మరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారని' బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్, బాధితులు సోని రోస్, థామస్ మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే ... 'సోని రోస్ తండ్రి ఫాదర్ ఆంథోని 1983– 86 మధ్యలో శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో 300 గజాల చొప్పున 22 ప్లాట్లు మరియా ఎడ్యుకేషన్ సొసైటీ పేరుపై కొనుగోలు చేశారు. 22 ప్లాట్లల్లో 3 రోడ్డు విస్తరణలో పోగా, స్థలం డాక్యుమెంట్లు అన్ని బెంగళూరులో ఉండే కూతురు సోనీ రోస్ వద్దే ఉన్నాయి. అయితే 2023 అక్టోబర్‌లో ఒకరు మరో బిల్డర్‌కు మొత్తం 19 ప్లాట్లు జీఓ 59 ప్రకారం రిజిస్ట్రేషన్ చేశాడని దీనిపై తాము రాయదుర్గం పోలీసులను ఆశ్రయించామని తెలిపారు. ధరణి, జీఓ 59 వల్ల ఎంతో మంది బాధపడుతున్నారని వారు చెప్పారు.

నేడు బీజేపీ నియోజకవర్గ సమావేశం

రాయదుర్గం: బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తల ప్రత్యేక సమావేశం శనివారం ఉదయం 9 గంటలకు చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్‌లో జరుగుతుందని గచ్చిబౌలి కార్పోరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్‌లోని బీజేపీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల, బూత్‌స్థాయి అధ్యక్షులు, సభ్యులు శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చేవెళ్ళ బీజేపీ పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుంది. 'కలర్స్ ఆఫ్ హోలీ' టాక్ ఇన్ హిందీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సీనియర్ రాజ యోగ టీచర్ బికే కోమల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు 040 23001234లో సంప్రదించవచ్చు.

తెలంగాణ ఆర్ట్ గ్రూప్‌షో ప్రారంభం





మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన తెలంగాణ ఆర్ట్ గ్రూప్ షోను శిల్పకారులు పద్మశ్రీ అక్క యాదగిరిరావు, పెయింటర్ తోట వైకుంఠం, యం.వి.రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. 144 చిత్రాలను ప్రదర్శనలో ఉంచారని ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఈమని శివనాగిరెడ్డి, ప్రొ.పీరన్, అనంతయ్య, పలువురు చిత్రకారులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'ప్రపంచ నీటి దినోత్సవాన్ని' నిర్వహించారు. 'శ్రేయస్సు, శాంతి కోసం జలం అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ...జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి సంరక్షణ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. అభివృద్ధిని పెంపొందించడంలో నీటి పాత్ర అమూల్యమైనదన్నారు.

రుద్రారం ఉన్నత పాఠశాలలో..

రసాయన శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీ.బీ. పాత్రుడు, తోటి అధ్యాపకులు, బీఎస్సీ విద్యార్థులతో కలిసి డాక్టర్ ఉమ రుద్రారం ఉన్నత పాఠశాలలో నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.నీటి వనరులను కాపాడతామని విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు రేకెత్తించి, నీటి సంరక్షణపై మరింత అవగాహన కల్పించేందుకు గోడ పత్రిక రూపకల్పన పోటీలు, ముఖానికి రంగులు వేసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

నేడు శనిత్రయోదశి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ ప్రధానరోడ్డులోని పర్వతవర్ధిని శివాలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం శివాలయంలో శనిపూజ, తైలాభిషేకం, నవగ్రహ పూజ నిర్వహిస్తారు. జాతకంలో శని దోషాలు పోవటానికి పూజ చేస్తారు. అదే విధంగా స్వామివారికి ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, విశేష పూజ, చామంతి పుష్పాలంకరణ ఉంటుంది. నవగ్రహ పూజకు నల్ల నువ్వులు, నల్ల వస్త్రం, బెల్లం, పువ్వులు, పండ్లు, కొబ్బరికాయతో తైలాభిషేకం, నవగ్రహ పూజల్లో పాల్గొనవచ్చని అర్చకులు తెలిపారు.

బాలుడు అదృశ్యం



అదృశ్యమైన సాయి కిరణ్

గచ్చిబౌలి: ఇంటి ముందు ఆడుకుంటూ ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మణికొండలోని శివాజీ నగర్‌లో నివాసం ఉండే సాయి కిరణ్ (8) ఈ నెల 16న ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రులు స్వామి, కనకలక్ష్మీ సమీప ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బంధువుల వద్ద వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో గురువారం రాయదుర్గం పీఎస్‌లో తల్లి కనకలక్ష్మీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ కలకలం

- పటాన్‌చెరు పారిశ్రామిక వాడల్లో మత్తుపదార్థాల తయారీ
- కెమిస్ట్‌లతో అక్రమార్కుల కుమ్మక్కు
- అధికారులు దాడులు జరుపుతున్నా ఆగని దందా
- తాజాగా రూ. 8.99కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత



బొల్లారంలోని పీఎస్ఎన్ పరిశ్రమ ఇదే

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు పరిధిలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. కొందరు అక్రమార్కులు నగరం శివారు ప్రాంతాలను డ్రగ్స్ తయారీ కేంద్రాలుగా ఎంచుకుంటున్నారు. మూతపడిన చిన్నపాటి పరిశ్రమల్లో నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో యాంటీ నార్కోటిక్ అధికారులు దాడులు నిర్వహించి రూ.8.99కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి, పాశమైలారం తదితర పారిశ్రామికవాడలు ఉన్నాయి. ఇక్కడ వివిధ రాష్ట్రాల చెందిన ప్రజలు ఉపాధి కోసం వచ్చి నివసిస్తుంటారు. ఈ ప్రాంతంలో రసాయన పరిశ్రమలు వేల సంఖ్యలో ఉన్నాయి. డ్రగ్స్ తయారీ విషయంలో కెమిస్టులది కీలక పాత్ర. వీరికి డ్రగ్స్ తయారీపై పట్టు ఉంటుంది. దీంతో డబ్బులు ఎక్కువగా సంపాదించాలనే దురుద్దేశంతో డ్రగ్స్‌ను తయారు చేసేందుకు కెమిస్టులతో కలిసి కొందరు పక్కదారులు తొక్కుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, కోల్‌కత్తా లాంటి మహా నగరాల్లో డ్రగ్స్ వాడకం ఎక్కువైంది. దీంతో అక్రమార్కులు ఇక్కడ వాటిని తయారు చేయించి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

తాజాగా బొల్లారంలో..

జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని పీఎస్ఎన్ మెడికేర్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో రసాయనాల ఉత్పత్తి జరుగుతుందని ఇంటర్‌పోల్ అధికారుల నుంచి సమాచారం వచ్చింది. దీంతో గురువారం రాత్రి డ్రగ్ కంట్రోల్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు జరిపారు. పరిశ్రమలో నిల్వ ఉన్న రూ. 8.99కోట్ల విలువైన నిషేధిత 3–మిథైల్ మిత్కాథినోన్ (3 ఎంఎంసీ) అనే డ్రగ్స్‌ను అధికారులు సీజ్ చేశారు. ఇందుకు కారణమైన పీఎస్ఎన్ మెడికేర్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ డైరెక్టర్ నిమ్మలపూడి కస్తూర్ రెడ్డిపై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాము, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్‌కిరణ్ తెలిపారు.



బొల్లారంలోని పీఎస్ఎన్ పరిశ్రమలో పట్టుబడిన డ్రగ్‌ను చూపుతున్న అధికారులు

గుట్టుచప్పుడు కాకుండా..

డ్రగ్స్‌ను తయారు చేసేందుకు అటవీ ప్రాంతాలు, మూతపడిన పరిశ్రమలు, ఫాంహౌజ్‌లను ఎంచుకుంటున్నారు. సుమారు రూ.25లక్షల వరకు వెచ్చించి డ్రగ్స్‌ను తయారు చేసేందుకు వసతులను సమకూర్చుకుంటున్నారు. కొడకంచి శివారులో డ్రగ్స్ తయారీ కేంద్రంలో రియాక్టర్‌తో పాటు డ్రయ్యర్, ఏసీ ఇతర విలువైన వస్తువులను వినియోగించారు.

డ్రగ్స్ కేంద్రాలపై దాడులు

- ఆరు నెలల క్రితం కొడకంచిలోని అటవీ ప్రాంతంలో డ్రగ్స్ తయారీ ముఠాను యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి పట్టుకున్నారు. సుమారు రూ.3 కోట్ల విలువైన 14 కిలోల నార్డాజెపమ్ అనే డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- ఏడాది క్రితం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని ఓ మూతపడిన పరిశ్రమలో డ్రగ్స్ తయారు చేస్తుండగా అధికారులు దాడులు జరిపి రూ.4కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- రెండేళ్ల క్రితం బొంతపల్లిలోని ఓ రసాయన పరిశ్రమలో జరిపిన దాడుల్లో డ్రగ్స్ దొరికినట్లు అధికారులు తెలిపారు.
- ఐదేళ్ల క్రితం అనంతారం గ్రామంలోని మూతపడిన ఓ పరిశ్రమలో తయారు చేస్తున్న రూ. 6కోట్ల విలువైన డ్రగ్స్, ఇతర వస్తువులను అధికారులు సీజ్ చేశారు.

లాజిస్టిక్స్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి



సదస్సును ప్రారంభించిన డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు

మాదాపూర్: లాజిస్టిక్స్ ప్రపంచ వాణిజ్యానికి జీవనాధారమని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం ఎంఎస్ఎంఈ శాఖ , భారత ప్రభుత్వం మద్దతుతో తెలంగాణ చాంబర్స్ అండ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ షిప్పింగ్, లాజిస్టిక్స్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు లాజిస్టిక్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. పరిశ్రమ సాంకేతికతకు అనుగుణంగా మద్దతు ఇవ్వాలని, లాజిస్టిక్స్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించాలని వారు కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. ప్రభుత్వం ప్రణాళిక బద్ధమైన ప్రధాన ప్రాజెక్టులైన భరత్‌మాల ఇది దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీని లక్ష్యంగా చేసుకుంటుందన్నారు. సాగరమాల ప్రాజెక్టు తీర రేఖ వెంబడి ఆధునీకరించిన ఓడరేవుల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌తో వస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు ఔటర్ రింగురోడ్డు ఉండడం వల్ల భారీ ప్రయోజనం ఉందన్నారు. అదే విధంగా రాష్ట్రానికి ప్రాంతీయ రింగురోడ్డు ఉంటుందన్నారు. ఇది నాలుగు లేన్‌లు, యాక్సిస్ నియంత్రిత డిజైన్‌ను కలిగివున్న 340 కి.మీ రింగురోడ్డు లాజిస్టిక్స్‌లో ఎంఎస్ఎంఈ భారీపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్‌స్వరూప్, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రదీప్ పనికర్, ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు మీలా జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

దావా సమన్లు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు (జూనియర్ డివిజన్)
భీమవరం, ప॥గో॥ జిల్లా
O.S. No.19/2022

వాది: యర్రంశెట్టి సరస్వతి
And
ప్రతివాది: తోట దేవి

To,
ప్రతివాది: తోట దేవి W/o అయ్యప్ప, ఫ్లాట్ నం.408, అంపైర్ మిడోస్ అపార్ట్‌మెంట్, సాయి అనురాగ్ కాలనీ, మియాపూర్–502032. తెలంగాణ.

మీరు పైన తెలిపిన దావా నెం.19/2022లో ప్రతివాదియై యున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం మీరు ఏప్రిల్ నెల 25వ తారీఖు 2024 వ సం॥ ఉదయం గం. 10:30 ని॥లకు హాజరు కావలెను. లేనియెడల సదరు దావా మీకు పరోక్షముగా విచారించి తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 25-04-2024

ఆరేపల్లి నటరాజ్, అడ్వకేట్
। టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట, భీమవరం, ప॥గో॥ జిల్లా, Cell: 9440457229